యువత అల్లూరి సీతారామరాజు అడుగు జాడల్లో నడవాలి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్య్రం వస్తుందని నమ్మి పోరాడి ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని మంగళవారం ఉషా ముళ్లపూడి కమాన్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతదేశ స్వాతంత్య్ర సంగ్రామంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. మన్యం ప్రజల్లో విప్లవ బీజాలు నాటి ప్రజలను చైతన్యపరిచి స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొనేలా చైతన్యపరిచిన మహనీయుడు అల్లూరి అని ఎమ్మెల్యే గాంధీ కొనియాడారు. 22 ఏళ్ల చిన్న వయసులోనే మన్యం ప్రజలను కలుపుకుని బ్రిటీష పాలనను ఎదిరించిన గొప్ప యోధుడని, సాయుధ పోరాటం ద్వారా మాత్రమే భారతదేశానికి బ్రిటీష్ వారి నుంచి విముక్తి లభిస్తుందని నమ్మిన యోధుడని కొనియాడారు. ఎంతోమందికి అల్లూరి జీవితం గొప్ప స్ఫూర్తి అన్నారు.ఆయన అడుగు జాడల్లో యువత నడవాలని తెలిపారు. కార్యక్రమంలో సాంబశివరావు, క్షత్రియ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ వృద్ధుడికి బెదిరింపు

రూ.91 లక్షలు వసూలు చేసిన కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ ఓ వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 74 ఏళ్ల వ్యక్తికి ఫెడెక్స్ కొరియర్ నుంచి కాల్ వచ్చింది. అతని ఆధార్‌కార్డు నంబర్ ద్వారా పంపించిన పార్శిల్‌లో 140 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు ఐదు పాస్‌పోర్ట్‌లు, బ్యాంకు క్రెడిట్ కార్డులు, 4 కిలోల దుస్తులు, ల్యాప్‌టాప్ ఉన్నాయని చెప్పారు. ఈ విషయంపై ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారని భయపెట్టారు. అనంతరం బాధితుడికి స్కైప్ ద్వారా సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి.. 'మీరు డ్రగ్స్ సరఫరా, మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారు'అని బెదిరించారు. నకిలీ సీబీఐ లేఖ చూపించి, అన్ని బ్యాంక్ అకౌంట్ల వివరాలు చెప్పాలని, నిబంధనల ప్రకారం వాటిని వెరిఫై చేస్తామని చెప్పి, ఆ బాధితుడి బ్యాంక్ ఖాతాలలో ఉన్న మొత్తం నగదు రూ.91,64,800 కాజేశారు. దీంతో బాధిత వృద్ధుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

అల్లూరి సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: మహనీయుల త్యాగాల వల్లే స్వాతంత్య్రం సిద్ధించిందని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకటరాజేశ్వరరావు అన్నారు.స్వాతంత్య్ర సంగ్రామంలో అల్లూరి నిర్వహించిన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అణచివేత, దోపిడీకి గురవుతున్న ప్రజలను సంఘటితం చేసి బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా సీతారామరాజు పోరాటం చేశారని కొనియాడారు. శ్రీనివాస్‌రావు, సంకీర్త పాల్గొన్నారు.

తల్లిని గెలిపించడానికి.. తనయుడు ప్రచారానికి!

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సునీత తనయుడు పట్నం రినీష్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్, హస్మత్‌పేట, అబ్రహార్ నగర్, సమతానగర్, హెచ్‌ఎఎల్ కాలనీ ప్రాంతాలలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరితో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేశామని... రాబోయే రోజుల్లో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చుతారని ఓటర్లకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకరాజు యాదవ్, గోపాల్ ముదిరాజు, నర్సింహ, శ్రీను, మల్లేష్, సమ్మయ్య, జ్యోతి అశోక్, సందిప్, మోహన్, షాయిన్‌షా తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న పట్నం రినీష్‌రెడ్డి

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

● మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు ● సందర్శించిన జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్లా



మాట్లాడుతున్న అధికారి



జేఎన్‌టీయూలో జరిగిన ఎన్నికల శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గానికి జనరల్ అబ్జర్వర్‌గా ఐఏఎస్ అధికారిణి ఎంఎస్ ప్రియాంక శుక్లా నియమితులయ్యారు. మంగళవారం ఆమె జేఎన్‌టీయూ కళాశాల ఆడిటోరియంలో శిక్షణా తరగతిని సందర్శించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్‌లతో సంభాషించి వారి శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ మైక్రో అబ్జర్వర్‌లకు స్వాగతం పలికారు. వీరు ఓటింగ్ బృందాలకు తోడుగా ఉంటారని తెలిపారు.

ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలి..

◆ జేఎన్‌టీయూలో ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్‌ల కోసం ఓట్ ఫెసిలిటేషన్ సెంటర్ నడుస్తోందన్నారు. తద్వారా వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. జనరల్ అబ్జర్వర్, మైక్రో అబ్జర్వర్లు తమ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వర్తించాలని కోరారు.

పోలింగ్ స్టేషన్‌లను తనిఖీ చేయాలి..

◆ అనంతరం కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సెగ్మెంట్‌ల సెక్టోరల్ ఆఫీసర్ల శిక్షణా తరగతిని సందర్శించి వారితో మాట్లాడారు. పోలింగ్ రోజు, ముందు రోజు సెక్టోరల్ ఆఫీసర్స్ హ్యాండ్ బుక్, విధులను పరిశీలించాలని ఆమె సూచించారు. పోలింగ్ స్టేషన్‌లను తనిఖీ చేయాలని, మౌలిక సదుపాయాలను పరిశీలించాలని ఆదేశించారు.

సమస్య ఉంటే దృష్టికి తీసుకురావాలి...

◆ సెక్టోరల్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సమస్య ఉంటే వెంటనే సమస్యను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. జనరల్ అబ్జర్వర్ కూడా కీలకమైన పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి ఓటర్ల సౌకర్యార్థం దిశా నిర్దేశం చేశారు.

◆ ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సెగ్మెంట్ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ పులి సైదులు, ఈఆర్‌ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్ కూకట్‌పల్లి సర్కిల్ హెచ్. కృష్ణయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మూసాపేట సర్కిల్ బి. సత్యనారాయణ, ఏఎంసీ మూసాపేట సర్కిల్ మురళి, ఏఎంసీ, కూకట్‌పల్లి మండలం కె. శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినయ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా, జెడ్‌సీ అభిలాష అభినవ్

మాదిగలకు మందకృష్ణ మోసం

దళిత సంఘాల నేతల ఆరోపణ

హిమాయత్‌నగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ జాతిని మోసం చేస్తూ, ఇప్పుడు తన స్వార్థం కోసం మతతత్వ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పలువురు దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. మందకృష్ణ చెపితే మాదిగలు వినే పరిస్థితి లేదని, అవసరమైతే ఆయన్ని మాదిగజాతి నుంచి బహిష్కరిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్. ఆర్.మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణను ఎందుకు చేయలేదో కృష్ణమాదిగ సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో సెక్యులర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని, అందుకే మాదిగ జాతి ఇండియా కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడు సి.వి.ప్రసాద్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల శ్రీహరి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేసి సునీతమ్మను గెలిపించాలి



వివేకానందనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ యువనేత మస్తాన్‌రెడ్డి, కార్యకర్తలు

మోతీనగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు కూకట్‌పల్లి నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం వివేకానందనగర్‌లో యువ నాయకుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎంపీగా సునీతను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ–బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ పర్యవేక్షకులు విఠల్‌రెడ్డి, రాఘవేంద్ర డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహయాదవ్, ప్రధాన కార్యదర్శి కనకయ్య ముదిరాజ్, సీనియర్ నాయకులు సుంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, రవి ముదిరాజ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి: చున్నూ పాషా...

మూసాపేట: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మూసాపేటలో ఆయను ఓటర్లను కలిసి సునీతమ్మను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రావు, తూము సచిన్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీనగర్‌లో సీపీఐ ప్రచారం..

బాలానగర్: సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా శ్రీశ్రీనగర్‌లో సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సునీతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కె.మనచారి, ఎం.డావీద్, డి. రాజుగౌడ్, ఎం.మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

గల్లీగల్లీకి వెళ్లి ప్రచారం చేయాలి...

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లోని కూకట్‌పల్లి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నేత గొట్టిముక్కల దేశాల్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సర్వే సత్యనారాయణ హాజరై మాట్లాడారు. అనంతరం కూకట్‌పల్లి పార్టీ కార్యాలయానికి విచ్చేసి కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. పట్నం సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేలా గల్లీగల్లీకి వెళ్లి ప్రచారం చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మొలుగు భీంరావు, మేకల రమేష్, సంజీవరావు, నాగార్జున, గోవింద్ గౌడ్, బాబు, సురేష్, భాను, బొట్టు రాజా, వెంకటేష్, జ్యోతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరిలో ఈటల విజయం తథ్యం

మూసాపేట కార్పొరేటర్ మహేందర్



భరత్‌నగర్‌కాలనీలో ప్రచారంలో చేస్తున్న మూసాపేట కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్

మూసాపేట: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మూసాపేట కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ మంగళవారం ఓటర్లను అభ్యర్థించారు. భరత్‌నగర్‌కాలనీలోని ఈడబ్ల్యూఎస్‌లో ఇంటింటికీ వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... ఈటల రాజేందర్ అనుభవజ్ఞులైన నాయకులు మన మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి పోటీ చేయటం గొప్ప విషయమన్నారు. ఆయను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే మన నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో చేస్తారన్నారు. ఇక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఈటల రాజేందర్‌కే ప్రజలు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఈసారి మల్కాజ్‌గిరిలో ఈటల విజయం తథ్యమని అన్నారు. 2014 కంటే ముందు దేశంలో ఉగ్రవాదులు విచ్చలవిడిగా బాంబు పేలుళ్లకు పాల్పడేవారన్నారు. కానీ మోదీ ప్రధాని అయిన తర్వాత ఒక్క బాంబ్ బ్లాస్ట్ కాలేదన్నారు. దేశాన్ని రక్షించే పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ భవాని, స్వామి, అభిలాష్, మల్లేష్ గౌడ్, డాకయ్య, శైలేష్, ఐలయ జానకీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నాం: చెదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్

కూకట్‌పల్లి: రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం రాష్ట్ర ఓబీసీ సెల్ కన్వీనర్ చెదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్ కూకట్‌పల్లి గ్రామంలోని పలు బూత్‌లలో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి లోక్‌సభలో ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తూ కరపత్రాలు అందజేశారు. ఈసారి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు,ఓబీసీ అధికార ప్రతినిధి మహేష్‌చారి,దళిత మోర్చా జిల్లా నాయకుడు వినయ్, డివిజన్ మహిళా మోర్చా జీఎస్ కృష్ణప్రియ, జీఎస్ ఉదయ్‌కుమార్, బూత్ అధ్యక్షులు శంకర్‌రెడ్డి, బాలకుమార్, ఫణీంద్ర, సంతోష్ గుప్తా, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రధానిగా మళ్లీ మోదీయే..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ యూసఫ్‌నగర్, సర్దార్‌నగర్‌లలో మంగళవారం మేడ్చల్ జిల్లా బీజేపీ సెక్రటరీ పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ జోరుగా ప్రచారం నిర్వహించారు. డివిజన్ ప్రజలు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. మల్కాజ్‌గిరి ఎంపీగా రాజేందర్ ఎన్నికైతే అల్లాపూర్ అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో బీజేపీకి ఉన్న ఆదరణ చూస్తే భారత ప్రధానిగా మళ్లీ మోదీయే అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్ జాదవ్, అంకిత్‌సింగ్, మామాజీ, పూజారాం, రవి యాదవ్, జయ, భాగ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




కూకట్‌పల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర ఓబీసీ సెల్ కన్వీనర్ చెదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్, కార్యకర్తలు



యూసఫ్‌నగర్, సర్దార్‌నగర్‌లలో ప్రచారం చేస్తున్న పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్

బీఆర్‌ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ కాలనీవాసులతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి పార్టీ కరపత్రాలు అందిస్తూ కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సమస్యలు, అభివృద్ధి కోసం కేంద్రంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, మేకల హరినాథ్, పిట్ల రాజు, మక్కాల సత్యనారాయణ, వాసుయాదవ్, బల్‌రాజు, నాగేష్, రాజుగౌడ్, మట్టి శ్రీను, కృష్ణారెడ్డి, బుర్రి యాదగిరి, ఖదీర్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట డివిజన్‌లో ప్రచారం...

మూసాపేట: మూసాపేట డివిజన్ పరిధిలో రాగిడికి మద్దతుగా మంగళవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఇంటింటి ప్రచారం చేశారు. రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, తుకారాం, వెంకటస్వామి, విష్ణు, రాజు, రాము, అరుణ్, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాగిడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

బాలానగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం ఫతేనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రచారం చేశారు. ప్రభాకర్‌రెడ్డినగర్, జింకలవాడ, సమతానగర్ బస్తీలో ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని అభ్యర్థించారు.

కార్పొరేటర్ సబిహా బేగం ప్రచారం...

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ డీ, ఈ బ్లాక్‌లలో మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై డీఐజీ ఆరా



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పోలీస్ అబ్జర్వర్, డీఐజీ డా.రామేశ్వర్‌సింగ్

మూసాపేట: మూసాపేటలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం పోలీస్ అబ్జర్వర్, డీఐజీ డా. రామేశ్వర్‌సింగ్ పరిశీలించారు. కూకట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం, మూసాపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ కృష్ణ మోహన్, ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభం

65 శాతం రాయితీ: నిర్వాహకులు వినోద్ జైన్

మోతీనగర్: మోతీనగర్ క్రాస్ రోడ్డులో కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఏడు రోజుల మాత్రమే ఉంటుందని నిర్వాహకులు వినోద్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కళాసిల్క్ ఎగ్జిబిషన్‌లో భారతదేశంలో ఎంపికైన చేనేత కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టెన్లు, జైపురి స్టోన్ జువెలరీ పెరల్స్, ఉడన్ హ్యాండీ క్రాఫ్ట్స్, బంజారా, కొల్‌కత్తా బ్యాగులు, ఒరిస్సా పెయింటింగ్ హ్యాండిక్రాఫ్ట్స్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. మొట్టమొదటిసారిగా 65శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

అవినీతి మచ్చలేని కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి



వెంకటేశ్వరనగర్‌లో ప్రచారం చేస్తున్న శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా వివేకానందనగర్ డివిజన్‌లో మంగళవారం శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ ప్రచారం నిర్వహించారు. వెంకటేశ్వరనగర్‌లో ఇంటింటికీ వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అటు నరేంద్ర మోదీ, ఇటు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకులని... అలాంటి వారే నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి రెండు లక్షల ఓట్ల భారీ మెజార్టీతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకుపోతున్న నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, డివిజన్ అధ్యక్షులు నర్సింగ్‌రావు, శంకరయ్య, శ్రీహరి యాదవ్, గోపాల్‌రావు, మనోజ్, స్రవంతి, లలితారెడ్డి, కవిత, మమత, జయశ్రీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మగ్గపెట్టిన మామిడి విషంతో సమానం

కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి

పంజగుట్ట: మోతాదుకు మించి రసాయనాలను ఉపయోగించి మామిడి పండ్లను మగ్గపెడుతున్నారని, ఇవి విషంతో సమానమని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు వచ్చిన ఫిర్యాదు మేరకు బాటసింగారం పండ్ల మార్కెట్‌ను సందర్శించామని, అక్కడ పండ్లు మగ్గపెట్టే తీరు చూసి అవాక్కైనట్లు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా నిషేధిత రసాయనాలు వినియోగిస్తూ కృత్రిమ పద్ధతిలో వ్యాపారులు పండ్లను మగ్గపెడుతున్నారని ఆరోపించారు. ప్రమాణాల ప్రకారం 10 కిలోల మామిడి పండ్లు మగ్గపెట్టేందుకు ఇతోఫిన్ ఒక్క చిన్న ప్యాకెట్ వాడాలని, అది కూడా పండ్లపై కాకుండా ప్రత్యేక బాక్స్‌లో పెట్టాలని తెలిపారు. ఈ విషయమై ప్రశ్నిస్తే తమపైనే వ్యాపారులు దాడులకు దిగుతున్నారని, వారు ఇంతకు తెగిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఆ మామిడి పండ్లు చిన్నపిల్లలు తింటే క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిపై మార్కెట్ కమిటీ ఉన్నతాధికారులకు, ఫుడ్ సెక్యూరిటీ అధికారులకు ఫిర్యాదు చెయ్యడమే కాకుండా చెక్ పోస్టులవద్ద వాహనాలు ఆపి మగ్గపెట్టిన పండ్లు బయటకు రాకుండా చేస్తామని హెచ్చరించారు.

కొలంబోలో అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలు

లక్డీకాపూల్: అంతర్జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన లింగనేని మారుతి శంకర్ గోల్డ్, సిల్వర్ మెడల్లనున కైవసం చేసుకున్నారు. శ్రీలంకలోని కొలంబో వేదికగా ఈ నెల 4న స్విమ్మింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఆసక్తికరంగా సాగిన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో పాల్గొన్న నగరానికి చెందిన సెవెన్ సీస్ ఎంటర్‌ట్రైన్‌మెంట్ అధినేత మారుతి శంకర్ ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్లను సాధించారు. బ్రెస్ట్‌స్ట్రోక్ విభాగంలో సైతం రెండు సిల్వర్ మెడల్లను సొంతం చేసుకున్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా విజేతగా నిలిచిన మారుతి శంకర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

'కాసాని'కి మద్దతుగా కార్పొరేటర్ ప్రచారం

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలిపించాలని హైదర్‌నగర్ డివిజన్‌లో మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయటం లేదన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు